సాక్షి వరంగల్

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



‘ప్రైవేట్’కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లుమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. - 8లో▸



అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగతోపాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $34^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

100 పడకల ఆస్పత్రిగా వర్ధన్నపేట సీహెచ్‌సీ



వర్ధన్నపేట : వర్ధన్నపేట 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను 100 పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు జీఓ కాపీని ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు హైదరాబాద్‌లో గురువారం అందజేశారు. ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రస్తావించారు. దీంతో స్పందించిన మంత్రి హరీష్‌రావు 100 పడకల ఏరియా ఆస్పత్రిగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి రూ.26 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావుకు ఎమ్మెల్యే అరూరి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. దీంతోపాటు కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మించడంతోపాటు హసన్‌పర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని మంత్రిని కోరినట్లు అరూరి రమేష్ తెలిపారు. మంత్రి స్పందించి త్వరలో మంజూరయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అరూరి రమేష్ చిత్రపటానికి క్షీరాభిషేకం

30 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయించినందుకు ఎమ్మెల్యే అరూరి రమేష్ చిత్రపటానికి గురువారం ఆస్పత్రి ఎదుట మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమార స్వామి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ అల్లమనేని మోహన్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘గృహలక్ష్మి’



గీసుకొండ : పరకాల నియోజకవర్గంలో అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసంలో గీసుకొండ, సంగెం మండలాలకు చెందిన 15 మందికి మైనార్టీ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గృహలక్ష్మి పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మచ్చాపూర్ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరగోని రాజ్‌కుమార్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు జోలె చిన్ని, పసుల రాజేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చల్లాను కలిసిన రేషన్ డీలర్లు

సంగెం: రేషన్ డీలర్లు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం సంగెం, గీసుకొండ మండలాల రేషన్ డీలర్లు కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినందుకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మేరుగు వీరేశం, దుడ్డె వెంకటేశ్వర్లు, సంపత్, రవీందర్, సమ్మయ్య, కవిత, రవీందర్, రమేష్, శంకర్‌రావు, సాంబయ్య పాల్గొన్నారు.

నేడు మెగా ప్లాంటేషన్

దుగ్గొండి: హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 34 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రతి గ్రామానికి 1000 చొప్పున 34 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

19 వరకు దరఖాస్తుల స్వీకరణ : డీఈఓ

కాశీబుగ్గ సెంటర్ : మహేశ్వరంలోని రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్‌లో వాచ్‌మెన్లు, స్కావెంజర్ పోస్టుల తాత్కాలిక భర్తీకి ఈనెల 19వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయి, 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు గల పురుషులు అర్హులని పేర్కొన్నారు. కనీసం 5.6 అడుగుల ఎత్తు ఉండాలని తెలి పారు. ఆసక్తి గల వారు అర్హతపత్రాల జిరాక్స్ కాపీలను ఈనెల 19లోగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని వివరించారు.

లక్ష్యం 2,200 ఎకరాలు

- పండ్ల మొక్కలు నాటేందుకు అధికారుల ప్రణాళికలు
- జిల్లాలో ఇప్పటి వరకు 610 ఎకరాల భూమి గుర్తింపు
- 323 గ్రామ పంచాయతీల్లో 332 మందికి ప్రోత్సాహం
- ఉపాధి హామీ పథకం కింద మూడేళ్లు నిర్వహణ ఖర్చు
- రైతులకు తగ్గనున్న పెట్టుబడి.. సమకూరనున్న అదనపు ఆదాయం



నల్లబెల్లి మండలం కొండాయిల్‌పల్లిలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

నల్లబెల్లి : రాష్ట్ర ప్రభుత్వం హరిత తెలంగాణ లక్ష్యంగా కోట్లాది మొక్కలను నాటి సంరక్షిస్తోంది. ఇందులో భాగంగా ప్రజలను భాగస్వాములు చేసి పచ్చదనాన్ని పెంపొందిస్తోంది. ఈ ఏడాది పండ్ల మొక్కలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఎలాంటి పెట్టుబడి లేకుండా ఉపాధి హామీ పథకంలో రైతులు పండ్ల తోటలు పెంచడం ద్వారా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

రైతులకు అవగాహన..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ సంవత్సరం రైతుల భూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని 323 గ్రామ పంచాయతీల్లో 332 మంది రైతులకు చెందిన 2,200 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. అందుకు అధికారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఉపాధి హామీ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు 610 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటేందుకు ముందుకు వచ్చారు. అదనపు ఆదాయం పొందేలా ముందుకు సాగుతున్నారు. లక్ష్యం పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మూడేళ్లపాటు మొక్కల నిర్వహణకు ఖర్చులు..

నాటి సంరక్షించిన ప్రతి పండ్ల మొక్కకు నెలనెలా మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. గుంతలు తీయడానికి, మొక్కలు నాటడానికి, మొక్కకు కర్ర కట్టడానికి, మొక్క కొనుగోలుకు, ఎరువులు వేయడానికి, నెలనెలా పర్యవేక్షణ చేయడానికి, బతికున్న మొక్కల ప్రకారం ప్రతి నెల మూడేళ్ల పాటు 100 శాతం నిర్వహణ డబ్బులను ఉపాధి హామీ పథకం నుంచి రైతులకు చెల్లిస్తారు.

రైతులకు తగ్గనున్న ఆర్థిక భారం..

ఆసక్తి కలిగిన రైతుల భూముల్లో మొక్కలు నాటేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రధానంగా మామిడి, జీడి మామిడి, జామ, ఉసిరి, నిమ్మ, పనస, సీతాఫలం, యాపిల్ బేర్, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోట, అల్లనేరేడు, బత్తాయి, కొబ్బరి తదితర మొక్కలను పెంచుకునేందుకు అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు మొక్కల పెంచేందుకు నిర్వహణ ఖర్చులు ఈజీఎస్ నుంచి చెల్లిస్తారు. దీంతో ఆర్థిక భారం తగ్గి, రైతులు అదనపు ఆదాయం పొందుతారు.

100 మొక్కలు నాటిన..



అధికారులు ప్రోత్సహించారు. ఉపాధి హామీ సిబ్బంది వచ్చి పరిశీలించి మంజూరు చేశారు. పెట్టుబడి తగ్గుతుందని భావించి నాకున్న ఎకరం భూమిలో 100 కొబ్బరి మొక్కలు నాటిన. మొక్కలతో పాటు కూలీలకు డబ్బులు చెల్లిస్తామని హామీఇచ్చారు. పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుందని ఆశించి కొబ్బరి మొక్కలు నాటిన.

- తోట రత్నాకర్, కొండాయిల్‌పల్లి, రైతు

ప్రణాళికతో లక్ష్యాన్ని పూర్తి చేస్తాం..



పండ్ల మొక్కల పెంపకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పండ్ల మొక్కల పెంపకం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రణాళికతో పనిచేస్తూ జిల్లాలో లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

- సంపత్‌రావు, డీఆర్‌డీఓ

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లాస్థాయి అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య



స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: జిల్లాలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర వేడుకల నిర్వహణ కోసం అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ ఐడీఓసీ నిర్మాణ స్థలంలో జరుగనున్న వేడుకలకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రౌండ్ క్లీనింగ్, వేదిక అలంకరణ, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనులను జీడబ్ల్యూఎంసీ అధికారులు, ఇన్విటేషన్ కార్డులు, అవార్డుల జాబితా తయారీని అదనపు కలెక్టర్(రెవెన్యూ)కు అప్పగించారు. ప్రొటోకాల్, ఇన్విటేషన్ కార్డులు అందరికి అందేలా చూడడం, వేదికపై సీటింగ్, ప్రెస్, అవార్డు గ్రహీతలకు సీటింగ్, స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం తదితర పనులు పర్యవేక్షించాలని ఆర్డీఓ, పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చే ముఖ్య అతిథికి జిల్లా ప్రగతికి సంబంధించిన సందేశాన్ని తయారు చేయాలని, వేదిక వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టం పెట్టాలని డీపీఆర్వో, వేడుకలకు వచ్చే వీవీఐపీ, వీఐపీ, అధికారులు, మీడియాకు ఏర్పాట్లు చేయాలని సివిల్‌సప్లయ్ అధికారులను ఆదేశించారు. 3 లక్షల మొక్కలను నాటేందుకు గ్రామాలు, మండలాల్లో స్థలాలను ఎంపిక చేసి గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీసీపీ రవీందర్ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి..

కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో అనుమతులివ్వాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో డీఐసీసీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా అనుమతి పొందిన 11 పరిశ్రమలు రూ. 8.69 కోట్ల పెట్టుబడి పెట్టనున్నాయని తెలిపారు. వాటిలో 78 మందికి ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే టీ ప్రైడ్ పథకం ద్వారా 8 మంది ఎస్సీ, ఎస్టీల లబ్ధిదారులకు రూ.24.12 లక్షల సబ్సిడీ మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నర్సింహమూర్తి, ఎంవీఐ రవీందర్, ఎల్‌డీఎం రాజు, డీటీసీపీ అధికారి రత్నకుమారి పాల్గొన్నారు. అదేవిధంగా జెడ్పీ కార్యాలయంలో నర్సంపేట నియోజకవర్గం, పాలకుర్తి నియోజకవర్గంలోని రాయపర్తి మండలానికి సంబంధించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం



వరంగల్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లా పరిధిలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సకాలంలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలతో పాటు ప్రభుత్వ శాఖల పనితీరుపై సభ్యులు చర్చిస్తారని సీఈఓ తెలిపారు.

16 నుంచి కుష్టు నిర్ధారణ పరీక్షలు

- ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించాలి
- డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ
- పీహెచ్‌సీల నోడల్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

గీసుకొండ : జిల్లాలో ఈ నెల 16 నుంచి 31 వరకు కుష్టు నిర్ధారణ కోసం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీల నోడల్ పర్సన్లకు కుష్టువ్యాధిపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. శరీరంలోని తెలుపు, ఎరుపు, రాగి రంగు మచ్చలు స్పర్శ లేకుండా మొద్దుబారి ఉండటం, ముఖంపై నూనె పోసినట్లు మెరుస్తూ ఉండటం, దద్దులు రావడం, అరికాళ్లు, అరచేతుల్లో తిమ్మిర్లు రావడం, కనురెప్పలు సరిగా మూసుకోకపోవడం లాంటి లక్షణాలు కనిపించే వారికి పీహెచ్‌సీల వైద్యులతో పరీక్షలు చేయించాలన్నారు. కుష్టు వ్యాధితో చేతి వేళ్ల వంకర పోవడం, ఫుట్ డ్రాప్ సమస్య ఉన్నవారికి ఉచితంగా శస్త్ర చికిత్సతో సరిచేస్తారన్నారు. అలాంటి రోగులకు ప్రభుత్వం రూ.12 వేలు అందిస్తుందన్నారు. వ్యాధి ఏ దశలో ఉన్నా సాధారణ వ్యాధి లాంటిదే అని ప్రజలు గమనించాలని సూచించారు. జిల్లాలో 6 పీబీ కేసులు, ఎంబీ కేసులు 36 ఉన్నాయన్నారు. ఇంటింటి సర్వే బ్యానర్లు, కరపత్రాలను డీఎంహెచ్ఓ పంపిణీ చేశారు. ఫిజియోథెరపిస్టు నర్సింహారెడ్డి, డీపీఎంఓ అనుపమ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నవీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఎరియర్స్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించారు. గుండా రవీందర్, దుర్గా ప్రసాద్, కుమార్, అనిల్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్
- నల్లబెల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్

నల్లబెల్లి : ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ రాబోయే ఎన్నికలకు పోలీసులు సన్నద్ధం కావాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలతో పోలీసులు మమేకం కావాలన్నారు. కేసుల సంఖ్యను తగ్గించి కౌన్సెలింగ్ ద్వారా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటి, పోలీస్ సిబ్బంది బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నర్సంపేట రూరల్ సీఐ కిషన్, ఎస్సై నైనాల కిషన్ ఉన్నారు.

రచ్చకెక్కిన ‘ఎన్నికల’ బదిలీలు!

- రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో వివాదంగా పోస్టింగ్‌లు
- ఎన్నికల బదిలీల్లోనూ ప్రజాప్రతినిధుల లేఖలు, జోక్యం
- డీజీపీ, సీఎస్, ఎన్నికల సంఘం వరకు ఫిర్యాదులు
- ప్రజాప్రతినిధుల సిఫారసులు, పోస్టింగ్‌లపై ఆరా..
- వివాదాస్పద పోస్టింగ్‌లపై రంగంలోకి ఇంటెలిజెన్స్?



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల జరిగిన బదిలీలు, నియామకాల ప్రక్రియలో కొందరు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, ఒత్తిళ్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రధానంగా పోలీస్, రెవెన్యూశాఖల్లో పలువురు బదిలీలు, పోస్టింగ్‌లపై ఆ శాఖల్లోనే చర్చ జరుగుతోంది. చినికి చినికి గాలివానగా మారిన ఈ బదిలీల వివాదం హైదరాబాద్ వరకు వెళ్లింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ నుంచి కూడా డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేంద్ర ఎన్నికల సంఘం వరకు వెళ్లిన ఫిర్యాదులపై కేంద్ర, రాష్ట్ర నిఘావర్గాలు రంగంలోకి దిగాయి. ఎన్నికల నేపథ్యంలో బదిలీలు, నియామకాలు పారదర్శకంగా జరగాలన్న ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కన పెట్టి మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు ప్రాధాన్యత ఇచ్చారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తుండటం ఆ రెండు శాఖల్లో చర్చనీయాంశంగా మారింది.

కలకలం రేపుతున్న ఫిర్యాదులు...

ఎస్సై నుంచి డీఎస్పీ స్థాయి పోలీస్ అధికారులు బదిలీల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారని, ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఉంటే తప్ప ‘సమర్థత’పై అధికారులకు పోస్టింగ్‌లు దక్కడం లేదని, కొందరు ఎమ్మెల్యేల లేఖకు ఓ రేటు ఉందంటూ వచ్చిన కథనాల క్లిప్పింగ్‌ల ఆధారంగా చేసిన ఈ ఫిర్యాదులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల జరిగిన పోలీస్, రెవెన్యూశాఖల బదిలీల్లో తాము లేఖలు ఇచ్చిన వారికే పోస్టింగులు ఇచ్చేలా చక్రం తిప్పిన ఘటనలు.. ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన వారినే తెచ్చుకుంటున్నారనే ఆరోపణలు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుండడం ఆయా శాఖలను కుదిపేస్తోంది.

వివాదంగా మారిన బదిలీలు.. మచ్చుకు కొన్ని..

- హనుమకొండ జిల్లాలో కీలకమైన డివిజన్‌కు ఆర్డీఓగా రెండున్నర ఏళ్లకుపైగా పనిచేసిన ఓ అధికారిని ఎన్నికల సంఘం నిబంధనల పరిధిలోకి వస్తారని మొదట హైదరాబాద్‌కు బదిలీ చేశారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలు గ్రేటర్ వరంగల్ పరిధిలోకి వస్తాయి కూడా. ఈ నేపథ్యంలోనే ఆయనను హైదరాబాద్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. ఐదారు రోజులకే ఆయనను వరంగల్ జిల్లాలో ఆర్డీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని వెనుక ఓ కీలక ప్రజాప్రతినిధితోపాటు మరో ఇద్దరు నియోజకవర్గస్థాయి నాయకుల సిఫారసు లేఖలు ఉన్నట్లు రెవెన్యూశాఖలో చర్చ జరుగుతోంది.
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డీఎస్పీ పోస్టింగ్‌పై కన్నేసిన ఓ అధికారి ఆదిలాబాద్ జిల్లా నుంచి వరంగల్ కమిషనరేట్‌కు వచ్చారు. తొర్రూరు డీఎస్పీ పదవీకాలం పూర్తికాకముందే ఓ కీలక ప్రజాప్రతినిధి (మంత్రి), ఓ ఎమ్మెల్యే సిఫారసు లేఖలతో ఆ అధికారికి డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. రెండు, మూడు రోజులకే తిరిగి ఆ పోస్టింగ్‌ను రద్దు చేసి చీఫ్ ఆఫీస్‌కు బదిలీ చేస్తూ మళ్లీ పాత డీఎస్పీకే పోస్టింగ్ ఇవ్వగా, ఆయన అందుకు ససేమిరా అనడంతో జి.వెంకటేశ్వరరావును డీఎస్పీగా నియమించారు. తొర్రూరుకు తీవ్రంగా ప్రయత్నం చేసిన ఆ ఆదిలాబాద్ డీఎస్పీ అదే కీలక ప్రజాప్రతినిధిని ఒప్పించి వరంగల్ జిల్లాలోని ఓ నియోజకవర్గకేంద్రంలో పోస్టింగ్ కొట్టడం పోలీస్‌శాఖలో చర్చగా మారింది.
- వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెల 31 వరకు జరిగిన పలువురి బదిలీలు దాదాపు సిఫారసు లేఖలతోనే పోస్టింగ్‌లు ఇచ్చారన్న చర్చ ఆ శాఖలోనే సాగుతోంది. గతంలో కమిషనరేట్ పరిధిలో పనిచేసిన పలువురు ఇన్‌స్పెక్టర్లు తిరిగి ఇక్కడే పనిచేయడానికి నేతలను ప్రసన్నం చేసుకున్నారన్న చర్చ అధికారుల్లోనే ఉంది. వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ సిటీ సెంటర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా అక్కడ రెండేళ్లు పూర్తయినప్పటికి అదే సబ్ డివిజన్ పరిధిలో ‘గంజ్’లో పోస్టింగ్ కొట్టారు. అక్కడ రెండేళ్లకు పైగా ఉన్న మరో ఇన్‌స్పెక్టర్ గతంలో పరకాల సబ్ డివిజన్‌లో ఎస్సై, సీఐగా పనిచేసినా... తిరిగి అదే సబ్ డివిజన్ పరిధిలోని రూరల్ ఏరియా స్టేషన్ సీఐగా లేఖలతో పోస్టింగ్ సాధించారు.
- హనుమకొండ జిల్లాకు చెందిన చాలామంది తహసీల్దార్లు పొరుగు జిల్లా అయిన వరంగల్‌కు బదిలీ అయ్యారు. పలు నియోజకవర్గాలు రెండు జిల్లాల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు ఒక జిల్లాలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు ఇప్పుడు వరంగల్‌కు బదిలీ అయినా పాత నియోజకవర్గంలోకే మళ్లీ వచ్చారు.
- తహసీల్దార్ల బదిలీల సందర్భంగా హనుమకొండ జిల్లాకు చెందిన వారు ఇతర జిల్లాలకు.. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కొందరు వచ్చారు. ఇదే క్రమంలో వచ్చిన ఓ తహసీల్దార్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఓ మండలంలో నియమించారు. ఇది నచ్చని ఓ జిల్లాస్థాయి ప్రజాప్రతినిధి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా సదరు తహసీల్దార్ సెలవులో వెళ్లారు. ఈ సీటుపై కన్నేసిన మరో తహసీల్దార్ సదరు పోస్టింగ్‌ను జిల్లా ప్రజాప్రతినిధి ద్వారా కొట్టేయగా.. సెలవులో వెళ్లిన మహిళా తహసీల్దార్‌ను పరకాల రెవెన్యూ డివిజన్‌లోని ఓ మండలానికి మార్చారు.

‘గృహలక్ష్మి’ పేరుతో పన్నుల వసూలు

- మున్సిపాలిటీ నుంచి తండాలను తొలగించాలని గిరిజనుల ఆందోళన
- వర్ధన్నపేటలో కిలోమీటరు దూరం వరకు నిలిచిపోయిన వాహనాలు

వర్ధన్నపేట : ఇంటి, నల్లా పన్నులు చెల్లిస్తేనే గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరిస్తామని మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారని డీసీతండా వాసులు గురువారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. భారీగా పెరిగిన పన్నులు తాము చెల్లించలేమని, తండాలను మున్సిపాలిటీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై ముళ్ల కంపలు, పిచ్చి చెట్లు అడ్డంగా పెట్టి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. సమాచారం అందుకున్న వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో వెళ్లి నిరసన తెలుపుతున్న గిరిజనులను రోడ్డుపై నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయినా వారు పట్టువీడక తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించమని పోలీలతో వాగ్వాదానికి దిగారు. ఎట్టకేలకు పోలీసులు బలవంతంగా వారిని రోడ్డు పై నుంచి ఈడ్చుకెళ్లి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. గంటకు పైగా రాస్తారోకో చేయడంతో వాహనాలు రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర నిలిచి పోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పన్నులతో సంబంధం లేకుండా గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరించాలని, అదేవిధంగా డీసీ తండా పరిధిలోని 8 తండాలను వర్ధన్నపేట మున్సిపాలిటీ నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



రోడ్డుపై ముళ్లకంప వేసి రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న కేంద్రం

- కలెక్టరేట్ ఎదుట మహాధర్నాలో కార్మిక సంఘాల నాయకులు



కలెక్టరేట్ ఎదుట మహాధర్నాలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

కరీమాబాద్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మహా పడావ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏకశిల పార్కు నుంచి ర్యాలీగా వెళ్లి వరంగల్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ భారతదేశంలోని సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తోందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా మోదీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, కూరగాయల ధరల పెంపుదలను అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను తీసుకువస్తూ కార్మికుల పొట్టకొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీవత్సకు అందజేశారు. ముక్కెర రామస్వామి, చెన్నకేశవులు, కృష్ణ, దయాకర్, సాగర్, బాబు, సాజియా, రాధిక, యాదగిరి, ఉపేందర్, ప్రభాకర్, ఓదెలు, శంకర్, చారి, రవి ఉన్నారు.

క్లుప్తంగా

జెండా గద్దెను శుద్ధి చేశారని..

● మల్టీపర్పస్ వర్కర్లపై దాడి

నల్లబెల్లి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పాత జెండా గద్దెను శుద్ధి చేసిన మల్టీపర్పస్ వర్కర్లను ఓ వ్యక్తి కులం పేరుతో దూషించి దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన నల్లబెల్లి మండలం రేలకుంటలో జరిగింది. మల్టీపర్పస్ వర్కర్లు మిడిదొడ్డి రాజు, చంద్రయ్య, సమ్మక్క, ఒదెమ్మ గురువారం జీపీ కార్యాలయ ఆవరణతో పాటు పాత జెండా గద్దెను శుద్ధి చేశారు. అదే గ్రామానికి చెందిన గుజిల సంజీవ మద్యం మత్తులో పాత జెండా గద్దెను ఎలా శుద్ధిచేస్తారని నిదీస్తూ కులం పేరుతో దూషించి గాయపరిచాడు. విషయం గమనించిన సహా మల్టీపర్పస్ వర్కర్ కిషన్.. సంజీవను అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆయనపై కూడా దాడి చేసి గాయపరిచాడు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న సర్పంచ్ సిద్దురి రత్నాకర్ రావు, ఉప సర్పంచ్ పప్పు రాజన్, ఎంపీవో కూచన ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు రాజు, సరస్వతి..బాధితులను పరామర్శించారు.

13న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి కన్నా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–07, 11 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని ఆయన వివరించారు. అండర్–7 కేటగిరీలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అండర్–11 కేటగిరీలో ఈనెల 27 నుంచి 29 వ తేదీ ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా, పోటీలకు అండర్–7 కేటగిరీలో జనవరి–01, 2016 తర్వాత జన్మించిన వారై, అండర్–11 విభాగంలో జనవరి–01 2012 తర్వాత జన్మించిన వారు అర్హులు అన్నారు. వివరాలకు 90595 22986 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

డోర్నకల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి మహబూబాబాద్ జిల్లా కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు కథనం ప్రకారం మండలంలోని చిలుకోడు గ్రామానికి చెందిన బాలికపై 2022 సెప్టెంబర్ 5న బయ్యారం మండలం కంబాలపల్లికి చెందిన కత్తుల వాసు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సెప్టెంబర్ 10న నిందితుడు వాసును అరెస్ట్ చేశారు. అదే రోజు ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసును అప్పటి సీఐ వెంకటరత్నం విచారణ జరపగా ప్రస్తుత సీఐ బి.ఉపేందర్‌రావు కోర్టులో ఆధారాలు ప్రవేశపెట్టారు. గురువారం సాక్ష్యాధారాలను పరిశీలించిన మహబూబాబాద్ జిల్లా కోర్టు జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్ నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. కాగా, పీపీ కె.పద్మాకర్ రెడ్డి కేసును వాదించారు.

కుటుంబ కలహాలతోనే కడతేర్చారు..

● నాగరాజు హత్యకేసులో భార్య, కొడుకు, అత్తామామ రిమాండ్
● వివరాలు వెల్లడించిన డీసీపీ సీతారాం



నిందితుల అరెస్టు చూపిస్తున్న డీసీపీ సీతారాం

దేవరుప్పుల : అనుమానం, కుటుంబ కలహాల కారణంగానే రామిండ్ల నాగరాజు హత్యకు గురైనట్లు జనగామ డీసీపీ సీతారాం వెల్లడించారు. ఇటీవల కామారెడ్డిగూడెంలో జరిగిన నాగరాజు హత్యకు సంబంధించి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నలుగురి అరెస్టు చూపించారు. కొడకండ్ల మండలం ఏడునూతులకు చెందిన రామిండ్ల నాగరాజుకు, దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడేనికి చెందిన చింత శైలజతో 20 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వారికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలున్నారు. మేనమామ చింత అబ్బసాయిలు.. అల్లుడిని ఇల్లరికం చేసుకోగా ఇక్కడే ఉంటూ హమాలీ పనిచేస్తున్నాడు. నాగరాజు కొంత కాలంగా మద్యానికి బానిసై భార్యపై అనుమానం పెట్టుకుని తరచూ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భర్తకు శైలజ అన్నం తినిపిస్తుండగా ఆమె వేలు కొరికాడు. శైలజ అరుపులు విన్న మామ అబ్బసాయిలు విడిపించేందుకు యత్నించినా సాధ్యపడలేదు. దీంతో ఆవేశంగా కట్టెతో తలపై బాదగా తీవ్రగాయాలయ్యాయి. చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం భార్య శైలజ, కొడుకు కిరణ్, అత్తామామలు లచ్చమ్మ, అబ్బసాయిలు.. నాగరాజును ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లో పూడ్చారు. అనంతరం బయటపడిన వీరు.. ఓ పెద్దమనిషి ద్వారా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. బుధవారం మృతుడి సోదరుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు గురువారం నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ వివరించారు. సమావేశంలో పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, ఏసీపీ సురేష్, ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని వరద బాధిత గ్రామాల్లోని కొండాయికి చెందిన 171 కుటుంబాలకు, మల్యాలలోని 42 కుటుంబాలకు, దొడ్లలోని 19 కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) ఆధ్వర్యంలో రూ.20లక్షలు విలువ చేసే 26 రకాల నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వరద బా ఈటతులకు నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. అనంతరం టీఆర్‌వీకేఎస్ హెచ్ 58 విద్యుత్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్ మాట్లాడుతూ.. తమ సంఘంలోని ఉద్యోగలంతా కలిసి వదర బాధితులకు కావాల్సిన దుస్తులు, నిత్యావసర వస్తువులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాదెం కృష్ణప్రసాద్, జీసీసీ డైరెక్టర్ పుల్సం పురుషోత్తం, ట్రాన్స్‌కో అధ్యక్షుడు మాడా దేవేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్, రవి, బండారి ప్రభాకర్, రాజగోపాల్, హరిప్రసాద్, రమణ, అక్రమొద్దీన్, కిరణ్, అక్బర్, వెంకన్న, నరేందర్, రమేష్, వెంకట్, నగేష్, రవీందర్, మహేందర్ రెడ్డి, పెసా మోబిలైజర్ రాకేష్, డివిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



కొండాయిలో సరుకులు అందజేస్తున్న ఏఎస్పీ సంకీర్త్, జాన్సన్

సరుకుల వాహనాలు ప్రారంభించిన సీఎండీ

హన్మకొండ: హనుమకొండనుంచి వరద ప్రాంతాలకు నిత్యావసర సరుకులతో వెళ్తున్న వాహనాలను సీఎండీ గోపాల్ రావు ప్రారంభించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) సేవలు అభినందనీయమని సీఎండీ కొనియాడారు.

తపాలా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హన్మకొండ: గ్రామీణ తపాలా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని తపాలా డివిజన్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ధర్నా చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల పట్ల కేంద్రం ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైన తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు కొమురారెడ్డి, ఎల్లయ్య, మనోహర్, తిరుపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

నిజాయితీగా వ్యాపారం చేయాలి



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

● పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: 'నిజాయితీగా వ్యాపారం చేయాలి. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ పాత ఇనుప సామగ్రి కొనుగోలు వ్యాపారులు, ఆటో కన్సల్టెన్సీ యాజమానులకు సూచించారు. కమిషనరేట్ పరిధిలో వాహనచోరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ట్రై సిటీ పరిధి పాత సామగ్రి కొనుగోలు వ్యాపారస్తులు, ఆటో కన్సల్టెన్సీ నిర్వాహకులతో గురువారం భీమారంలోని శుభం గార్డెన్స్‌లో సీపీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. చోరీకి గురైన వాహనాలు కొనొద్దన్నారు. వ్యాపారస్తులు చట్ట వ్యతిరేకంగా చోరీ వాహనాలు కొంటే.. పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో క్రైం డీసీపీ దాసరి మురళీధర్, ఏసీపీలు మల్లయ్య, రమేశ్‌కుమార్, కిరణ్‌కుమార్, డేవిడ్ రాజు, సతీశ్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఒరిజినల్ పత్రాలు తప్పనిసరి

వాహనదారులు ప్రయాణించేటప్పుడు వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సీపీ ఏవీ.రంగనాథ్ ప్రజలకు సూచించారు. ఒరిజినల్ పత్రాలు వెంట తెచ్చుకోవడంలో ఇబ్బంది ఉంటే.. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన యం–వాలెట్ యాప్‌లో చూపించినా సరిపోతుందని వివరించారు.

వాహనాల తనిఖీలో సీపీ

హసన్‌పర్తి: వాహనదారుడు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ సూచించారు. పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలను సీపీ రంగనాథ్ గురువారం పరిశీలించి తనిఖీల్లో పాల్గొన్నారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధి బాహుపేట క్రాస్, కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధి యాదవనగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో క్రైం డీసీపీ మురళీధర్, హసన్‌పర్తి, కేయూసీ ఇన్‌స్పెక్టర్‌లు గోపీ, అబ్బయ్య, ఎస్సైలు సురేశ్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, వలీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి: సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీటి వసతి, టాయిలెట్స్, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, రాగిజావను పరిశీలించారు. అనంతరం అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మన ఊరు– మన బడి పథకం కింద రూ.7321కోట్లతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో సకల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కోదాటి దయాకర్‌రావు, తేరాల యాకయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

● 103 గ్రాముల బంగారం, 824 గ్రాముల వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ బారి

వరంగల్ క్రైం : తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగతో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన ముగ్గురిని మడికొండ పోలీసులు అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ మహమ్మద్ అబ్దుల్ బారి తెలిపారు. వీరి నుంచి రూ.7 లక్షల విలువైన 103 గ్రాముల బంగారం, 824 గ్రాముల వెండితోపాటు రెండు ఐఫ్యాడ్లు, రూ.19 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా సిద్దవుట్ మండలం బాక్రాపేటకు చెందిన పంతగిరి రాజా అదే రాష్ట్రంలో పలు చోరీ కేసుల్లో జైలు శిక్ష అనుభవించి విడుదలయ్యాడు. అనంతరం గత జూన్‌లో కాజీపేటకు వచ్చి తిలక్‌నగర్‌లో నివాసం ఉంటూ రాత్రి సమయాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మడికొండ, ధర్మసాగర్ మార్గంలో తనిఖీలు నిర్వహిస్తున్న మడికొండ పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. నిందితుడి వద్ద బంగారం లభించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అరెస్టు చేశారు. అలాగే, చోరీ సొత్తును కొనుగోలు చేసిన వరంగల్‌కు చెందిన పోలిపాక సందీప్, ఆడెపు రమేష్, కాజీపేటకు చెందిన సాతూరి వెంకటేశ్‌ను అరెస్టు చేసి బంగారం, వెండి, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



బిందు మృతదేహం

కేసముద్రం: అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ధర్మారంతండాజీపీలో జరిగింది. తండాకు చెందిన గుగులోతు రాందాస్‌కు భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం శేఖరంబంజార గ్రామానికి చెందిన బానోతు శ్రీను కూతురు బిందు(24)తో గత నెల 4న వివాహం జరిగింది. కాగా, పెళ్లికి ముందు నుంచే బిందుకు అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేవి. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఉన్న నీటి సంపులో పడిన బిందును మానుకోట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బిందు దుస్తులు ఉతుకుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో పక్కన ఉన్న నీటిసంపులో పడి మృతి చెందినట్లు మృతురాలి భర్త రాందాస్, అతడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పెళ్లయిన 10 రోజుల నుంచే అల్లుడు తన కూతురు కొట్టేవాడని, ఆమె మృతి విషయంలో రాందాస్‌పై అనుమానం ఉందని మృతురాలి తండ్రి శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా, పెళ్లయి 36 రోజులకే కూతురు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

సరైన సమయంలో అభ్యర్థుల ఎంపిక

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

హన్మకొండ: సరైన సమయంలో అభ్యర్థులను ఎంపిక చేసి ప్రకటిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో బీజేపీ పార్లమెంట్ ప్రవాస్ యోజన వరంగల్ క్లస్టర్ (వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాలు) సమావేశం జరిగింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. సమావేశ వివరాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలన, హామీల వైఫల్యాన్ని ప్రజల్లో ఎండగడుతామన్నారు. ఎన్నికలు వస్తున్నాయని కొత్త హామీలు ఇస్తూ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కుటుంబం కోసం పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్న కేసీఆర్‌ను గద్దెదించుతామన్నారు. రైతు సంక్షేమం, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం ఎజెండాగా ముందుకెళ్తున్నామన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇతర రాష్ట్రాల బీజేపీ ఎమ్మెల్యేలు పర్యటిస్తారన్నారు. ఎంతోమంది కీలక నాయకులు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, గరికపాటి మోహన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మూడు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లాల అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్య విద్యార్థులు

కాశిబుగ్గ: స్టైఫండ్ పెంపు కోసం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు చేపడుతున్న ఆందోళన కొనసాగుతోంది. హౌస్ సర్జన్లకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఐదు రోజుల నుంచి ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్నారు. ఆరో రోజు గురువారం వైద్యశాల నుంచి పోచమ్మ మైదాన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్టైఫండ్ పెంపు కోసం ఆరు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 2014 సంవత్సరం నుంచి స్టైఫండ్ పెంచలేదన్నారు. దీనిపై ఇప్పటికైనా స్పందించి స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు.

కొనుగోలుదారుడిపై దాడి..

హసన్‌పర్తి: ప్లాట్‌ను ఓ సర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసి.. మరో చోట చూపించారు. చూపించిన ప్లాట్ సర్వే నంబర్ తప్పుగా తేలడంతో విక్రయదారులను ప్రశ్నించారు. వారు కొనుగోలుదారుడిపై దాడికి దిగారు. ఈ ఘటనపై బాధితుడు కేయూ పీఎస్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. హసన్‌పర్తి మండలం భీమారానికి చెందిన మండల రమేష్ అదే గ్రామానికి చెందిన చింతల రాజకొమురయ్య, స్వరూప వద్ద ఇటీవల 2వందల గజాల ప్లాట్ కొనుగోలు చేశాడు. ప్లాట్ వివాదంలో ఉండడంతో కొనుగోలుదారుడు నిలదీశాడు. దీంతో రాజకొమురయ్య, స్వరూప.. బాధితుడిని చితకబాదారు. ఈ ఘటపై బాధితుడి ఫిర్యాదు మేరకు రాజకొమురయ్య, స్వరూపపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

గురుకులానికి వస్తూ..

● విద్యార్థిని అదృశ్యం

కొత్తగూడ: కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలకు చేరుకోవాల్సిన విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మరిపెడకు చెందిన విద్యార్థినికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో గురుకుల జూనియర్ కళాశాలలో సీటు వచ్చింది. తల్లిదండ్రులతో కలసి వచ్చి కళాశాలలో సర్టిఫికెట్లు ఇచ్చింది. నాలుగు రోజుల తరువాత సామాగ్రి తీసుకుని వస్తామని తెలిపి వెళ్లారు. అధిక వర్షాలు తగ్గిన తరువాత కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వచ్చింది. ఈ క్రమంలో గురువారం కళాశాలలో ఉన్న తమ కూతురును చూసేందుకు తండ్రి వచ్చారు. కూతురు కనిపించకపోవడంతో ప్రిన్సిపాల్‌ను ఆరాతీయగా ఆమె రాలేదని తెలిపారు. దీంతో ఆందోళన చెందిన విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి మడికొండ ఔటర్ రింగ్ రోడ్డు పై జరిగింది. హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌కు చెందిన కొండవిడి యశ్వంత్, ములుగు జిల్లా వెంకటపూర్ మండలం జవహర్‌నగర్‌కు చెందిన గంప రవికుమార్, భూపాలపల్లి జిల్లా మహాముత్తారానికి చెందిన చాట్ల పల్లవి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి జవహర్ నగర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో మడికొండ శివారు టేకులగూడెం మామిడితోట వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు క్రాస్ చేస్తుండగా వాహనం అదుపుతప్పి అతడిని ఢీకొంది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందగా, ద్విచక్రవాహనంపై ఉన్న యశ్వత్(22), రవికుమార్, పల్లవికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం యశ్వంత్ మృతి చెందారు. ఈ ఘటనపై రవికుమార్ తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ సీఐ వేణు తెలిపారు.

మున్నేరు వాగులో పడి వృద్ధుడు..



ఈశ్వరయ్య(ఫైల్)

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు మున్నేరు వాగులో పడి బయ్యారం మండల కేంద్రానికి చెందిన తేలు ఈశ్వరయ్య(60) మృతి చెందాడు. వాగులో ఉన్న మృతదేహం చూసిన తండావాసులు పోలీసులకు సమాచారం అందజేయగా వారు వాగు వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం బయ్యారం మండల కేంద్రానికి చెందిన తేలు ఈశ్వరయ్యగా గుర్తించారు. కాగా, గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి ఈశ్వరయ్య శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కురవి ఎస్సై గోపి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. అంతకుముందు ఈశ్వరయ్య అదృశ్య ఘటన సోషల్‌మీడియాలో వైరలైంది.

చికిత్స పొందుతున్న యువతి..



సిరిచందన (ఫైల్)

దుగ్గొండి: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గోపాలపురంలో జరిగింది. గ్రామానికి చెందిన చల్ల గొండ రాజిరెడ్డి కూతురు సిరిచందన్ (22) బీటెక్ పూర్తి చేసింది. ఇటీవల ఐటీ ఉద్యోగానికి ఎంపికైంది. మరో మూడు రోజుల్లో బెంగళూరుకు వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే ఏమీ జరిగిందో తెలియదు. ఈనెల 8న కుటుంబీకులు పొలం వెళ్లాక పురుగుల మందుతాగింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న రాజిరెడ్డికి సిరిచందన పురుగుల మందు కనిపించింది. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.